ANDHRA JYOTHI

11 NOV 2020

## 16న డ్రాఫ్ట్ రోల్ ప్రదర్శన

యానాం, నవంబరు 10: పుదుచ్చేరి రాష్ట్రవ్యాప్తంగా ఓటర డ్రాఫ్ట్ రోల్‌ను ఈనెల16న ప్రదర్శిస్తామని యానాం ఇన్‌చార్జ్ పరిపాలనాధికారి జి.గౌరిసరోజా తెలిపారు. మార్పులు, చేర్పులు ఉంటే డిసెంబరు 15వ తేదీలోపు చేసుకోవాలన్నారు. 2021 జనవరి ఒకటో తేదీ నాటికి 18ఏళ్ల వారు ఓటు హక్కు నమోదుచేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలు పుదుచ్చేరి ఎన్నికల శాఖ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చన్నారు.

## యానాం చేరుకున్న ఎస్ఎస్‌పీ

యానాం, నవంబరు 10: పుదుచ్చేరి పోలీస్ శాఖకు చెందిన క్రైమ్, ఇంటెలిజెన్స్ ఎస్ఎస్‌పీ ఆకాంక్ష యాదవ్‌ను మూడు రోజుల పర్యటనలో భాగంగా యానాం చేరుకున్నారు. ఈసందర్భంగా యానాం చేరుకున్న ఆమెకు ప్రభుత్వ అతిథిగృహం వద్ద ఎస్పీ భక్తవత్సలన్, సీఐ గూటం శివగణేష్ స్వాగతం పలికారు. యానాం పోలీస్‌స్టేషన్ సందర్శన, విజిలెన్స్ అవేర్‌నెస్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ENADU

11 NOV 2020

## 'పుదుచ్చేరి కోటా సీట్లపై సీబీఐ విచారణ జరిపించాలి'

**యానాం:** జిప్‌మెర్ వైద్య కళాశాలలో ఈ ఏడాది పుదుచ్చేరి కోటా సీట్లు పొందిన 31 మంది స్థానికతపై సీబీఐ విచారణ జరపించాలని అన్నాడీఎంకే కార్యదర్శి అన్బళగన్ లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడీకి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరపాలని ఆమె ఆదేశించారు.

SAKSHI

11 NOV 2020

## '10 శాతం రిజర్వేషన్‌కు అన్ని పార్టీల ఆమోదం ఉంది'

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా నాలుగు రీజియన్‌లలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు మెడికల్ తదితర వృత్తి కోర్సుల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కేబినెట్ తీర్మాన ఫైలును ఆమోదించకుండా దానిని ఎల్జీ బేడీ కేంద్రప్రభుత్వానికి పంపడంపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఎం నారాయణసామి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేబినెట్ నిర్ణయం మేరకు 6 నుంచి 12వ తరగతి వరకు ప్రభుత్వ స్కూళ్లలో చదివిన విద్యార్థులకు మెడికల్‌సీట్లలో 10 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని నిర్ణయించినట్లు సంబంధితఫైలును ఎల్జీ ఆమోదించాల్సి ఉన్నప్పటికీ రాజ్యాంగ విరుద్ధంగా ఫైలును కేంద్రప్రభుత్వానికి పంపారని విమర్శించారు. పది శాతం రిజర్వేషన్‌కు అన్ని పార్టీల ఆమోదం ఉందన్నారు. మంత్రులు మల్లాడి కృష్ణారావు, కందసామి, ఎంపీ వైద్యలింగం, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## 'దుబ్బాక' విజయంపై బీజేపీ విజయోత్సవాలు



సంబరాల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

యానాం: తెలంగాణలోని దుబ్బాక నియోజకవర్గ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి ఎమ్.రఘునందన్‌రావు విజయం సాధించడంతో మంగళవారం యానాంలో బీజేపీ శాఖ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు మంగళవారం జరుపుకొన్నారు. స్థానిక సుబ్రహ్మణ్యభారతి వీధిలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ అధ్యక్షుడు పెమ్మాడి దుర్గాప్రసాద్, సీనియర్ నేత కనకాల రామదాసు ఆధ్వర్యంలో విజయోత్సవాలను జరిపి అందరికీ స్వీట్లు పంచి ఆనందం వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు లంక స్వామి, గుబ్బల లక్ష్మణరావు, పాలెపు భగవాన్, కాలాడి నరసింహమూర్తి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## రహదారి ఛిద్రంపై ఫిర్యాదు



కనకాలపేటలోని ధనలక్ష్మీనగర్‌లో రహదారి దుస్థితి ఇలా..

యానాం: మంచినీటి పైపులైను కోసం రహదారిని తవ్వేసి వదిలేసిన ఘటనపై చర్యలు తీసుకోవాలని స్థానిక కనకాపేట గ్రామపరిధిలోని ధనలక్ష్మీనగర్ గ్రామస్థులు మంగళవారం అధికారులను కోరారు. గతంలో లక్షలాది రూపాయల ఖర్చుతో నిర్మించిన గ్రావెల్ రహదారి ద్వారానే వాహనాలతోపాటు, గ్రామస్థులంతా రాకపోకలు సాగిస్తారని, ఈ నేపథ్యంలో పైపులైను వేస్తున్నామని చెప్పి మొత్తం రహదారిని తవ్వేయడంతో ఇబ్బందులు ఎదురొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం వస్తే దారిపై వేసిన మట్టినానిపోవడంతో కనీసం నడవలేకపోతున్నామన్నారు. అధికారులు తక్షణం ఈ సమస్యపై స్పందించాలని కోరారు.

## యానాం విచ్చేసిన పుదుచ్చేరి 'ఎస్ఎస్‌పీ' ఆకాంక్ష యాదవ్

యానాం: పుదుచ్చేరి సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(ఎస్ఎస్‌పీ) ఆకాంక్ష యాదవ్( క్రైమ్ అండ్ ఇన్వెస్టిగేషన్ విభాగం) మంగళవారం పుదుచ్చేరి నుంచి యానాంకు వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ అతిథి గృహం వద్ద ఆమెను దుశ్శాలువాతో పోలీసు అధికారులు ఘనంగా సత్కరించారు. సాధారణ పర్యటనలో భాగంగా ఆమె యానాం విచ్చేశారు. బుధవారం ఆమె వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఆమె వెంట విజిలెన్స్ అధికారులు హేమచంద్రన్, కన్నన్, ఎస్సై వెంకటేష్ పెరుమాళ్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ భక్తవత్సలన్, సీఐ గూటం శివగణేష్, ఎస్సైలు సుబ్బరాజు, కనకారావు, ఆల్ఫాన్స్‌రాజు, శేరు నూకరాజు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలి

యానాం: షెడ్యూల్డుకులాలు, షెడ్యుల్డు తెగల విద్యార్థులు స్కాలర్‌షిప్‌ల కోసం వచ్చే నెల 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని పుదుచ్చేరి ఆదిద్రావిడ డైరెక్టర్ ఎస్.యశ్వంతయ్య మంగళవాతు ఒక ప్రకటనలో కోరారు. కేంద్రప్రభుత్వ స్పాన్సర్ ద్వారా వచ్చే స్కాలర్‌షిప్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే స్కాలర్‌షిప్‌లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు కోవాలని కోరారు. స్కాలర్‌షిప్స్. జీఏవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.